గంగాభవాని నవ్వింది గట్టిగా సురేష్ వినేట్లు. ఆమె సంగతి చూడాలి ముందు.

"తులసి  కూడా ఇద్దరికీ ఒకేసారి కట్టలేదు. ఒక నెల గంగాభవానీ గారికి, ఒక నెల మీకు కడుతుంది."

గంగాభవాని నవ్వు ఆగిపోయింది.

"మా అద్దె ఆపటానికి వీల్లేదు" అంది కఠినంగా.

"అయితే ఆ విషయం మీ ఇద్దరూ తేల్చుకుని మాతో చెప్పండి. తులసి జీతంలో మాత్రం నెలకు కొంత మొత్తం ఒకరికే కట్టడానికి సాధ్యమవుతుంది."

గంగాభవానికి ఉక్రోషం వచ్చింది.

"అలా అయితే ఇల్లు ఖాళీ చేయండి."

తులసి ఆమెను చూసి నవ్వింది.

"సురేష్ సంగతి మీకు తెలీదా?"

సురేష్ నవ్వాడు. "ఇంకా నేను పూర్తిగా చెప్పందే."

గంగాభవాని శాంతించింది.

"నన్నెప్పుడు రమ్మంటారు మళ్ళీ?" అడిగాడు ముసలాయన.

"అయిదారు నెలల తర్వాత వస్తే మొత్తం ఒకేసారి తీరిపోతుంది" అన్నాడు సురేష్.

"ఎలా?"

"ఈ లోపల మీరెగిరిపోతారని గట్టి నమ్మకం నాకు."

"ఫస్ట్ తారీఖు సాయంత్రం రండి" అంది తులసి .

అతను వెళ్ళిపోయాడు.

"ఇలాంటి మనిషిని ఎన్నుకుని పొరపాటు చేశారు మీరు" అంది గంగాభవాని తులసితో.

"మార్కెట్లో వున్నవాటిల్లో యిదే బెస్ట్ శాంపుల్ అనిపించింది" నవ్వుతూ అంది తులసి.

"కావాలంటే మీరూ ప్రయత్నించండి" అన్నాడు సురేష్.

గంగాభవాని కోపంగా వెళ్ళిపోయింది.

సురేష్ తులసిని కౌగిట్లోకి తీసుకున్నాడు.

"ఇంటికి రాగానే నీకో విషయం చెప్పాలని ప్రయత్నిస్తోంటే వెధవ అడ్డంకులన్నీ."

"ఏమిటది?"

"అయ్ లవ్ యూ డార్లింగ్."

తులసి నవ్వింది "ఇదా?"

"ఇదేనని ఎవరన్నారు? ఇది మొదలు."

"దేనికి?"

అతను చెప్పటం ప్రారంభించాడు  చేతలతో.

"సాయంత్రం నేను త్వరగా ఇంటికొస్తాను. నువ్వు కూడా వచ్చేసెయ్" అంది అద్దం ముందు నిలబడి.

"ఓ! నేను ఎప్పుడయినా రడీయే! నువ్వే సాయంత్రాలు వద్దంటావు. ఎప్పుడూ?" అన్నాడు సురేష్ .

తులసి పెదాలు బిగపట్టి అద్దం ముందున్న దువ్వెన తీసి అతని మీదకు విసిరేసింది.

"అబ్బ" అన్నాడతను.

"లేకపోతే! నేను చెప్పేదేమిటి? ఇవాళ సాయంత్రం స్పెషల్ప్రోగ్రామ్ ప్లాన్ చేశాను."

"ఎందుకు?"

తులసి అతని దగ్గరకొచ్చి బుగ్గ పట్టుకుని గిల్లింది.

"ఓ మతిమరుపు అవతారం! మనిద్దరికీ ఫ్రెండ్షిప్ అయిన రోజిది! ఇవాళే నాకు జీతం కూడా వస్తుంది కాబట్టి."

"ఓస్ అదా! ఇంకా మనిద్దరం హోటల్లో గడిపిన ఆ రోజు తాలూకు ఉత్సవం అనుకున్నాను."

తులసి నవ్వుతూ చేయి వూపి త్వరత్వరగా వెళ్లిపోయింది. అతను స్నానం ముగించాడు. డ్రస్ చేసుకుని హిందీ పాటల్లో తనకొచ్చిన ఒకే ఒక్క పాట తాలూకు చరణం మొదలుపెట్టాడు.

"నైన్ మిలాకర్, చైన్ చురానా కిస్కా హైయే కామ్."

"అరె, హమ్ సే పూఛో, హమ్కో పతా హై, ఉన్జాలిమ్ నామ్-"

గంగాభవాని గడపలో నిలబడి తను వచ్చినట్లు తెలియజేయడానికి దగ్గింది.

"హలో! లోపలకి రండి!" చిరునవ్వుతో ఆహ్వానించాడు సురేష్ .

"ఇక్కడే మాట్లాడవచ్చు!" అందామె అక్కడే నిలబడి.

"ఇక్కడ మనిద్దరం ఇలా నిలబడడం ఎవరయినా చూస్తే...."

"చూస్తే చూడనీండి! తప్పేముంది?"

"మన మధ్య ఏమీ లేదనుకుంటారు"

ఆమె మొహం ఎర్రబడింది. కోపం-సిగ్గూ....

"అంటే?"

"అంటే అదే. సరే అదలా వుండనీయండి. తులసి కోసం వచ్చారు కదూ యిప్పుడు?"

"మీతో మాట్లాడడానికే వచ్చాను."

"నాకు ముందు మాట్లాడటం యిష్టముండదు- తర్వాతయితే ఎంత సేపయినా

మాట్లాడతాను"

"ముందేమిటి?" అనుమానంగా అడిగింది.

"ఇంతకూ ఏం మాట్లాడడానికొచ్చారు?"

"ఇంటి అద్దె గురించి."

"దాన్ని గురించి మాట్లాడేదేముంది? రెండు నిమిషాలు మౌనం పాటిస్తాం నేనూ తులసీ."

"మీ పాత రూమ్ తాలూకూ ఓనరు ఆరు నెలల అద్దె బాకీ కోసం వచ్చాడంటే మా యింటి విషయంలోనూ అలాగే చేస్తారని నాకు తెలుసు. అందుకే ఇంకొక్క నెల అద్దె అడ్వాన్స్ కావాలి."

అతను చకచకా ఆలోచించాడు.

"మీరలా తొందరపడకండి. ఇంకో నెల ఆగితే మీకు ఆరు నెలల అద్దె అడ్వాన్స్ కావాలన్నా యిచ్చేస్తాం"

"అంటే.. మీకు ఉద్యోగం వచ్చిందా?"

"అవును. ఇరాక్‌లో ఇంజనీర్‌గా వెళుతున్నాను. అరబ్‌దేశాల సంగతి మీకు తెలీందేముంది? తెగ డబ్బు?"

"అవును- ఆ సావిత్రి వాళ్ళ ఆయన కూడా..."

"డబ్బే కాదు-బోలెడు ఫారిన్ గూడ్స్. కెమెరా, టి.వి, వి.సి.ఆర్., వాచీలు, టేప్‌రికార్డర్లు, చీరలు."

గంగాభవాని మొహంలో ఆనందం తొణికిసలాడింది.

అతనూహించినట్టే అద్దె విషయం మర్చిపోయింది.

"ఎప్పుడు వెళుతున్నారు?"

"వచ్చేవారం. అంటే వచ్చే వారం ఈపాటికల్లా అక్కడి నుంచే మీతో ఫోన్లో మాట్లాడుతుంటాను. వస్తాను, పాస్‌పోర్ట్ ఆఫీస్‌కెళ్ళాలి."

వడివడిగా బయటికొచ్చి తలుపుకి తాళం వేశాడతను. గంగాభవాని వాళ్ళింటి గడపలోనే నిలబడింది.

బస్‌లో ఇంటర్వ్యూ జరిగేచోటకు చేరుకునేసరికి పది... ఇంకో అరగంట టైముంది.

అభ్యర్థులంతా గుమిగూడి మాట్లాడుకుంటున్నారు.

"వేకెన్సీలు పాతిక! ఆ వేకెన్సీల్లో పాతికమందీ పనిచేస్తూనే వున్నారు. వాళ్ళను కన్‌ఫరమ్ చేయడానికి ఈ ఇంటర్వ్యూ ఏర్పాటు చేశారు"

"అంటే బయటివాళ్ళెవరికీ దొరకవా?"

"ఇంకేం దొరుకుతాయి మట్టి. సంవత్సరం నుంచీ పనిచేస్తున్న వాళ్ళు లోపల్లోపల

సౌరంగాలు తవ్వకుండా వుంటారా?"

ఓ క్లర్క్ వచ్చి అందరి పేర్లూ రాసుకెళ్ళాడు.

మొదటి పేరు సురేష్‌కి వచ్చింది. లోపలకెళ్ళాడతను. ఇద్దరే ఉన్నారు ఇంటర్వ్యూ చేసేవాళ్ళు.

"ఈ కంపెనీలో తయారయ్యే వస్తువుల అమ్మకం పెరగాలంటే మీరేం చేస్తారు?"

"కొత్త స్కీమ్స్ పెడతాను."

"ఏమిటా స్కీమ్స్?"

"మీరు నాకు తప్పకుండా జాబ్ యిస్తానంటే చెప్తాను. లేకపోతే నా స్కీమ్స్ విని నన్ను బయటకు గెంటి మీరే ఆ స్కీమ్స్ ఇంప్లిమెంట్ చేసుకుని పైకెళ్ళిపోతారు."

అతను నవ్వాడు.

"గుడ్ జోక్!"

"మీ టేస్ట్ చాలా పూర్ స్టాండర్డ్‌లో వుంది. అది బాడ్ జోక్."

అతని మొహంలో వోల్టేజ్ తగ్గిపోయింది.

"వాటీజ్ దట్ స్కీమ్?"

"మన కంపెనీ టీవీలు కొన్నవారందరిలోనూ లాటరీ వేసి వందమంది విజేతలను ఎన్నిక చేసి వారిని ఒక వారం రోజులు కాశ్మీర్‌లో గడిపేందుకు పంపిస్తాం."

"ఇందులో కొత్తేముంది?"

"ఎందుకు లేదు? ఆ వారం రోజులూ వాళ్ళు ఎంజాయ్ చేసేందుకు అమ్మాయిలను కూడా మనమే సప్లయ్ చేస్తాం."

రెండో అతని ఓల్టేజ్ కూడా తగ్గిపోయింది.

"ఒక వేళ విజేతలు స్త్రీలయితే?"

"అబ్బాయిలను సప్లయ్ చేస్తాం."

"వెరీ బాడ్ టేస్ట్. మన దేశంలోని స్త్రీల గురించి అలా మాట్లాడటానికి నీకు సిగ్గువేయడం లేదూ?"

"మగాళ్ల అండర్‌వేర్స్ నుంచీ సిగరెట్లూ, బీడీలు, బ్రాందీలూ, పరుపులూ, మంచాలు అన్నిటికీ ఆడవాళ్ళను వ్యాపార ప్రకటనల్లో వాడటం లేదూ?"

"దటీజ్ డిఫరెంట్.."

"దిసీజ్ ఆల్సో డిఫరెంట్ సర్! డెఫినెట్‌లీ డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్ మన కష్టమర్సుకి. ఇక అమ్మాయిలకా కొదవలేదు....! సంతలో 'కమల' లను అమ్మే దేశమేగా మనది..."

"లేదా స్కీమ్ కొంచెం మార్చవచ్చు. అయిదు టీవీలు కొన్నవారికి ఒక అమ్మాయి

ఉచితం..."

గమనిక: "అమ్మాయిల స్టాక్ ఉన్నంత వరకే ఈ స్కీమ్ అమలులో వుంటుంది గనుక వెంటనే పరుగెత్తండి."

"యూ కెన్ గో నౌ"

"ఇంకో స్కీమ్ కూడా వుంది సార్! నాకు జాబ్  ఇచ్చినా, ఇవ్వక పోయినా మీరు ఉపయోగించుకోవచ్చది."

"దట్సాల్‌రైట్! యూకెన్ గో......"